# మామ్ వ్రాయని కథ

టెంట్ తలుపు గుడ్డతీస్తే, చెట్ల ఆకుల మధ్య నుండి తెల్ల గొట్టం దిగేసినట్లు ఎండ చుర్రుమంటూ, గుండ్రంగా తన మీదే పడుతుంది. తలుపుగుడ్డ వేసేస్తే చీకటి. టెంట్‌లోంచి బైటపడ్డాడు రవికుమార్. చెట్ల నీడలో కుర్రాడు సలీమ్ టీ సరంజామా మధ్యగా కూర్చుని, స్టౌతో తంటాలుపడుతున్నాడు. టీ త్రాగడం తప్ప, ఆదివారంనాడు చేసేపని కనిపించదు—ఆ అరణ్యంలో.

దూరంగా తారుబండి, ఇంకా దూరంగా రాక్షసిలా చదునుచేసే యంత్రం; కంకర గుట్టలు; ఎడ్లబండి. బండతను, బండికింద పాగా దిండుగా పెట్టుకొని పవ్వళిస్తున్నాడు. రోడ్డు పనివాళ్ళు వో ఇరవై మంది కుదిరారు. కాలక్షేపానికి చూస్తూ కూర్చుందామంటే, వొక్క ఆడది కూడా పనికి కుదరలేదు. ఆదివారం ఎవ్వరూ పనికిరారు టెంట్‌చుట్టూ—పేరులేని పెద్ద అడివిచెట్లు, తాగి పేట్రేగిపోయినట్లు గాలికి చప్పుడు చేస్తూ, వెక్కసమై కక్కినట్లు కాంతిరానీక, లోన ఇరుక్కున్న పవన కన్యని బైటకి వెళ్ళనీక; పట్టపగలు చెఱచడానికి సిద్ధపడ్డట్లు—ఈ రాక్షసి చెట్టు దురంతపు క్రీడల్ని ఎంతసేపని చూడ్డం! అటు, మరో టెంట్. స్నేహితుడు చంద్రశేఖరంది. అడుగో బైటకొచ్చి సైకిల్ సిద్ధంచేస్తున్నాడు. పంక్చరైంది కాబోలు. తంటాలు పడుతున్నాడు ఇంక మరి పోస్టుతెచ్చే ఉత్తరాలవాడి దగ్గరకు సైకిల్‌మీద వెడతాడు కాబోలు!

రవికుమార్ చిరాకుకి కారణం, ఈ ఆదివారం వచ్చే పోస్టే ఆదివారం కాని, ఈ అడవి ప్రాంతానికి జీప్ బైలు దేరదు అందులో వొస్తాయి ఉత్తరాలు. జీప్ కొంతదూరం వెళ్ళి నిలిచిపోతుంది. అక్కడికి వెళ్ళి తెచ్చుకోవాలి ఉత్తరం. రెండుమైళ్ళు కాలిబాట—సైకిల్ కూడా సరిగ్గా వెళ్ళదు. నడిపించుకు వెళ్ళాలి ఆ పైన మరో నాలుగుమైళ్ళు. పోస్టు కుర్రాడు అక్కడ గంటసేపు కొలువు చేస్తాడు. చుట్టుపక్కల కూలిజనం. తనబోటి వొకరిద్దరు రోడ్డు ఉద్యోగులూ, అక్కడ హాజరై పోస్ట దేవర

వార్ని చిత్తగించాలి ఇంత కష్టపడివెడితే, తనకి వొక్క ఉత్తరమూ వుండదు. ఆ చంద్రశేఖరానికి బోలెడు ఉత్తరాలు-నాలుగైదు తప్పదు. ఇలా ప్రతి ఆదివారం వెళ్ళడం, తనకి వొక్క ఉత్తరం లేకపోవడం జరిగితే, విముఖుడై వెళ్ళడం మానుకున్నాడు రవికుమార్. తనకి ఒక్క ఉత్తరమూ లేకపోవడం వొక బాధ—చంద్రశేఖరానికి రెండుమూడు రావడం మరొక బాధ. ఇద్దరికీ ఉత్తరాలు లేకపోతే, హాయిగా కబుర్లు చెప్పుకుంటూ, కులాసాగా వెన్నెల అందం మెచ్చుకుంటూ, వెన్నెట్లో దూరంగా దుస్తులు విప్పి కట్టే అడవి విన్యాసంచూస్తూ టెంట్‌కి చేరుకుని వుందురు కదా వారి స్నేహం అడివి ఇచ్చిన ఏకాంతం అనే అరణ్యానికి పెరిగింది. పోస్టు అనే రాక్షసి, తమ తపో స్నేహాన్ని ధ్వంసం చేస్తున్నాడు. సైకిల్ బాగైనట్లుంది. స్టాండ్ మీద నిల బెట్టి ఇటొస్తున్నాడు చంద్రశేఖరం టీ కోసం.

చంద్రశేఖరం మంచివాడే.... ఉత్తరాలు వ్రాసేవాళ్ళున్నారు అందులో అతని తప్పేముంది. మధ్యపాపిడి తీస్తాడు. కాస్త పక్కగా తియ్యమంటే వినిపించుకోడు.... పక్కన సుడి వుందిట. మనిషి బాగానే వుంటాడు. పొడుగాటి కోలమొహం ... దట్టమైన కనుబొమ్మలు. కళ్ళల్లో కాస్తంత కొంటెతనం వుంది. నవ్వుకి సిద్ధంగా వుండే నోరు— పై పళ్ళ వరసలో వొక పన్ను మాత్రం కాస్తంత వంకర. మంచి నుదురు- ఛాయ పరవాలేదు. రెండుసార్లు తప్పి, ఇంజనీరింగ్ చదువు పూర్తిచేసి, వొకేడు హెడ్డాఫీసులో పనిచేసి, ఈ అడవిలో రోడ్డు నిర్మాణానికి, తనతో వొచ్చాడు. ఈ ఐదారు నెలల్లోనూ స్నేహమయ్యాడు. ధైర్యంగలవాడు. మొండిఘటం. పురుగు పుట్రా, పామూ, తేలూ- దేనికీ భయపడడు. తనలాగే అతనికీ పెండ్లికాలేదు. తనకి భయం— చీకటిపడ్డాక, టెంట్ ముందు బండ్లవాళ్ళు కట్టెలు పోగుచేసి రాత్రంతా మంటవేస్తేకాని ఉండ లేదు. అటవీ శాఖాయన కూడా వున్నాడు. కాని ఆయన రాత్రుళ్ళు ఊళ్ళోకి పోతాడు. చంద్రశేఖరం, పులివేట కబుర్లు, పాము పగపట్టడం ఉదంతాలూ రాత్రంతా చెప్పాడు. ఇంక ఆ రాత్రి అతని టెంట్‌లోనే పడక. ఏవో

పలకరిస్తాడు, నిద్రలో కేకలేస్తాడు లేపి మంచినీళ్ళు త్రాగమని, కబుర్లతో ధైర్యం చెప్తాడు. వారి స్నేహం పెరుగుతూ వొచ్చింది. కాని పరిపూర్ణమవలేదు. ఈ పోస్టులో ఉత్తరాలు రాకపోవడం తనకెంత బాధాకరంగా వుందో, అతనంటే ఎంత అసూయపడతాడో చంద్రశేఖరానికి తెలియదు. అవును, తనకి ఉత్తరాలు ఎవరు వ్రాస్తారు? అతనిది సామాన్య కుటుంబం తండ్రి చనిపొయ్యాడు. తల్లి అల్లుడు దగ్గర వుంటుంది. అక్కా, బావ వారివారి పనుల్లో తీరక, ఉత్తరం వ్రాయరు. ఇంక స్నేహితులు. చదువుకునే రోజుల్లో వొకర్నివిడిచి వొకరు బ్రతకలేం అనుకునేవారు. పెద్దయి ఎవరి ఉద్యోగాల్లోకి వారు పొయ్యాక: స్నేహాలుండవు; ఉత్తరం ముక్కైనా వ్రాయరు.... పెండ్లి శుభలేఖ తప్పిస్తే. సరే ఆ లేఖ కొస్తే, పెండ్లయ్యాక చేరుతుంది తనకి చదువుకునేందుకు ఏవన్నా నాలుగైదు పుస్తకాలు పంపమని, గుర్నాథానికి వ్రాశాడు. జవాబులేదు. తన ఉత్తరం అందిందా అసలు? ఏమో! కాస్తంత ఉన్నవాడై వుంటె: వొకరిద్దరు స్నేహితులు, క్షేమసమాచారం వాకబు చేస్తూ వ్రాసేవాళ్ళేమో. విశాల భారత దేశంలో వున్న పేచియే అది. దూరం.... ఎవరి గొడవ వారిది.... రాబడి పెరిగి, చదువులు ప్రబలి, కుటుంబాలు విచ్ఛిన్నం అవడం ప్రారంభించాక, ఎవరికివారే యమునాతీరే అయిపోతూంది సామాజిక జీవితం.

"నేను రాను" అన్నారు రవికుమార్ కచ్చితంగా.

"వొస్తావుట్లే చెట్లన్నీ కొట్టేశారు. నేల చదును చేశారు. హాయిగా ఇద్దరం సైకిల్ మీద పోదాం."

"రానన్నాగా— ఎందుకూ రావడం. ఒక్క ఉత్తరమన్నా రాదా యిరి. నీకేమో డజను...."

"ఓస్ ఇదా. ఇవాళ వొస్తుందేమో చూడు, రోజు లెప్పుడూ ఒక లాగుండవు. పోస్టు కుర్రాడు నీపట్ల కనికరించవచ్చు. అందుచేత, రా."

"నాకు వ్రాశేవాడెవడూ లేడు" అన్నాడు రవి.

"వ్రాశేవాడు లేకపోవచ్చు. కాని వ్రాశేది వుండొచ్చుగా."

"అంటె?"

"అడవికాసిన వెన్నెలల్లె నీ తెలివి ఇల్లాతయారైందే-ప్రేయసి వ్రాయకూడదూ....." అని నవ్వడం సాగించాడు చంద్రశేఖరం టీ త్రాగాక, రవికుమార్ భుజంపట్టుకు లేవదీసి, ప్రయాణం కమ్మని టెంట్ లోంచి దువ్వెన అద్దం తెచ్చాడు.

"ముస్తాబు పూర్తి కానీ."

"ఎవరు చూడను ముస్తాబు?"

"నాగరికతతో మనకున్న బంధం దుస్తులే."

"సీక్రేం, నీకు ఉత్తరా లొస్తాయిగా" అని నసుగుతూ రవికూడా బైలుదేరాడు.

సాయంత్రం ఐదైంది. చెట్లవెనక దిగుతున్నసూర్యుడు, పారా హూంషార్ అన్నట్లు, నాలుగు ఎర్ర కిరణాలను ఆకుల సందుల్లోంచి పోనిచ్చి పోస్టులో వొచ్చిన మనియార్డర్ తీసుకునేవాడి వేగిరంతో దిగిపోతున్నాడు. బండివాడు, వంటకి కట్టెలు చేరవేస్తున్నారు. రొట్టెలు చేసేయత్నం మొదలెట్టాడు సలిమ్. ఇద్దరూ నడవడం ప్రారంభించారు. రవికుమార్ భయపడుతున్నాడు .... తిరిగి వొచ్చేటప్పుడు చీకటి....అడివి....మరీ భయం. పైపెచ్చు....ఉత్తరం పత్రం ఉండదు. ఎందుకొచ్చిన ప్రయాస? ఫరవాలేదు, తోడున్న వ్యక్తి శేఖరం.

ఫర్లాంగ్ నడవగానే, ఎదురుగా వొస్తున్నాడు పోస్టు కుర్రాడు సోమయ్య. భుజాన ఉత్తరాల సంచి చేతిలోకర్ర, కిర్రుజోడు. జీప్ చెడిపోయిందట. బాగయ్యేసరికి ప్రొద్దవుతుందిట-ఉదయం వెళ్ళొచ్చు-ఈ రాత్రికి, రోడ్డు కాంప్‌లో గడుపుదామని వొచ్చాడుట సోమయ్య.

"మీకెయ్యో ఉత్తరా లుండాయండీ" అన్నాడు సోమయ్య. వాడిది కొస్తంత మెల్లకన్ను. చంద్రశేఖరాన్ని సంబోధిస్తూ రవికుమార్‌కేసి చూస్తున్నాడు.

"నాకా?" అన్నాడు ఆశ్చర్యంగా రవి.

"నీక్కాకపోతే ఏం,-నా ఉత్తరం తీసుకో-నీదనుకో" అన్నాడు చంద్రశేఖరం.

"నిజంగా! నా కిచ్చి వేస్తావా-నాదే. పిది నా కిచ్చెయ్యాలి....బదులు ఏంకావాలి?"

"పందెమా. సరె. కార్డయితే ఐదు, కవరైతే పది—"

"నా ఇష్టమొచ్చింది ఏరుకుంటాను."

సోమయ్య టెంట్ ముందు సంచీ విప్పి, అన్నీ బైట పరిచాడు. అందులోంచి, చంద్రశేఖరాని కొచ్చిన వాటిని విడదీశాడు ఒక కార్డు, రెండు కవర్లు వున్నాయి. చంద్రశేఖరం, వాటికేసి చూస్తుండగానే, చివాలున ఒక కవరు లాక్కున్నాడు రవికుమార్. జేబులో పెట్టుకున్నాడు. లోపలికెళ్ళి పదిరూపాయలనోటు తీసిచ్చాడు.

"ఓర్- నిజంగానే."

"మాట తిరక్కూడదు. నువ్వన్న ప్రకారమే- ఆ కవరు నాది- డబ్బు తీసుకో, ఉ" అని బలవంతంగా చంద్రశేఖరం జేబులో పెట్టాడు.

అతను ఆశ్చర్యపడ్డాడు. స్నేహితుడి మనస్సు నొప్పించడం ఇష్టం లేక, ఆ నోటు తీసుకున్నాడు. ఉత్తరం రాకపోవడం వెనక ఎంతటి ఉద్రేకం వుందో గ్రహించి చకితుడయ్యాడు. కొన్ని విషయాలపట్ల కొందరికి అట్లాంటి వెర్రి అభిమానం, పట్టుదల వుంటాయి కాబోలు ననుకున్నాడు. దానివెనుక అనురక్తి, గాఢమైన వాంఛకూడా వున్నాయి. ఆ వాంఛలో మనిషి వ్యక్తిత్వం బైటపడుతుంది. అల్పమైన, అస్పష్టమైన, అనుమానాస్పదమైన పట్టింపులతో మన జీవితాలు బంధించబడ్డాయి. సోమయ్యకు తిండీ, పడక ఏర్పాటుచేసి, మంటముందు భోజనాలు కానిచ్చి, టెంట్స్‌లోకి వెళ్ళపరున్నారు చిత్రం, రవికుమార్ మామూలు ధోరణిలో మాట్లాడలేదు. అసలు అతనేమీ, మాట్లాడినట్లేలేదు. ఆ కవరు ఉదంతం రగిల్చిన ఉద్రేకం నుండి తేరుకున్నట్టులేదు. ఆ సమయంలో పలకరించడం మంచిదికాదు. ఏమన్నా ఏం చేసినా, అపార్థం చేసుకుని, బాధపడే అవస్థ అది. నిద్రాదేవి కౌగిలిలో కరగాలి, ఘనీభవించిన ఆ అతిశయం.

రవికుమార్ వింత ప్రవర్తన గురించి ఆలోచించి, ఆశ్చర్యపడిన చంద్రశేఖరానికి, ఆ రాత్రి నిద్దే పట్టలేదు. ఆ కవరు ఎవరి దగ్గర్నుంచో, పై అడ్రసు దస్తూరిచూసి తెలుసుకోవల్సింది. తనకి ఊ తొందర. ఆ

కవర్లో ఏముందో మాట అట్లా వుంచి, అది ఎవరు వ్రాసిందో కూడా తెలుసుకోనందుకు తన్ను తాను కోపగించుకున్నాడు. అది ఎవరు వ్రాశారో ఊహించడం సాగించాడు. ఓ విషయం తల్చుకుంటే గుండె గుభేలుమంటుంది. స్నేహితుడే, తెలిసినా పెద్ద ప్రమాదం ఏమీ జరగదు, నిజమే ఐనా ఆ ఒక్క విషయం ఎవ్వరికీ తెలియకూడ దనుకున్నాడు. ఈ విషయం చెప్పవల్సినంతటి ప్రాణస్నేహితుడా రవికుమార్? తలిదండ్రులు పెద్దకట్నంతో వొచ్చే- పిల్లని- నాన్న స్నేహితుడి కూతుర్ని- తనకి అంటగట్టాలని నిశ్చయించుకున్నారు. దూరపు చుట్టం కూతురు రేవతిని చేసుకోవాలనుంది తనకి. ఆమె వయస్సు ఇరవై లోపు. అందమైంది, అది తప్ప ఎన్నతగ్గ మరో విశేషం ఏమీలేదు. వారిది బీద కుటుంబం. తండ్రి వున్నప్పుడు స్కూల్లో చదివించాడు. ఆయనే పోగానే మానేసింది తల్లి కట్నంగా ఏమీ ఇచ్చుకోలేదు. అమ్మానాన్న అందం అక్కర్లేదు. వారికి కావాల్సింది కట్నంతో పిల్ల. కనీసం రెండువేలన్నా ఇచ్చుకో లేనివారు అల్లుడిని ఏం ఆదుకుంటారు. కొంప కెడితే ఇంత కూడన్నా పెడతారా! బీదతనానికీ, అందానికీ ముడిపెడతాడెందుకు భగవంతుడు! ధనికుల పిల్లలు- తను చూసినంత వరకూ- బస్సుల్లో కాలేజీల్లో చదువు వెలిగిస్తున్నాం అని ఎగిరిపడుతూ, రెండుజడలు, కళ్ళద్దాలు, లిప్‌స్టిక్‌లు, హాండ్‌బాగ్‌లు వేసుకు సినిమాలు చూడ్డంకాక, మరే సంస్కృతి, చక్కదనం వారిలో లేదు. ఆదేం చిత్రమో. యీ ఆధునిక పరికరాలొచ్చాక, ఎత్తుపళ్ళదీ, వంకరముక్కుదీ, పిల్లికళ్ళదీ, గూనిమెడదీ.... అందరూ, అందంగా ముస్తాబై, ఏ అవకరమూ బైటికి కనబడకుండా, నాజూకుగా, నీట్‌గా కనబడి, అమాయకపు యువకుల్ని.... ముఖ్యంగా ఐ.ఏ.ఎస్. ప్యాసైన వాళ్ళనే తెచ్చుకుంటున్నారు. అంతా డబ్బు, హోదాలో వుంది జగత్తు. మానసిక సౌందర్యం, బాహ్య సౌందర్యం, సౌకుమార్యం మానవత్వపు భవనానికి పునాదైన వ్యక్తిగతమైన ప్రేమా, ఆప్యాయతా, నిజాయితీ, వాటిజోలి ఎవరిక్కావాలి? పొడుగాటి కనురెప్పలు, నుదిటిని.... నీళ్ళ రాసాక అతుక్కున్న కవరు అంచెల్లె.... అంటిపెట్టుకుని, పీడించి వొదిలిపోయి, సైనికులను శత్రురాజుల కిచ్చివేసినట్లు, ముంగురులు అల్ల

ల్లాడుతూ, వాటి వంకర నీడలు, కనురెప్పల నీడలతో కలిసి బుగ్గల మీదికి వొయ్యారంగా జారుతూ, పళ్ళల్లో తళుక్కుని తళుక్కుని వొక్కొసారి ప్రజ్వరిల్లేటట్లు చేసి.... తన పెదవులతో వాటిని తాకి, పైకి తొంగించే వరకూ, గుండెల్లో రంగులరాట్నం తిరిగినట్లు.... అల్లాఅల్లా.... ఐపోతుంది రేవతిని తల్చుకుంటె. ఆనాడు పాతబడి గోడపక్కన సిగ్గుతో తలవొంచి, చెట్లమీద పక్షులకూత వింటూ, రాబొయ్యే చందమామ సిగ్గుకి ముగ్ధఅవుతూ నిలబడ్డప్పుడు ఆమె అంత అందంగానూ వుంది, తెల్లగోడ మీద పడ్డ ఆమెనీడ. మెల్లగా ఈ ఉద్యోగంలో నాలుగురాళ్ళు వెనకేసి, రెండువేలు పోగుచేసి అవి రేవతి తల్లికిచ్చి అదే కట్నం సొమ్ముగా ఇప్పించాలని అతని రహస్యమైన ఆలోచన. ఆ కవరు రేవతి దగ్గర నుంచి కాదుకదా! అదీ చంద్రశేఖరం భయం. రాత్రి వొంటిగంటైంది. రెండైంది. ఫిబ్రవరి చివరిరోజుల చలి, మూడురోజులు వెలుపలున్న కన్యకి మల్లె అస్పష్టమైన తపనతో వెంటాడుతోంది టెంట్‌లోంచి బైటికి రాగానే గుడ్డపీలికలు పారేసినట్లు ఆకుల నడుమ వెన్నెల వెలుగు ముక్కలుగా నేలమీదపడింది తలంటుకు సిద్ధమై జడ విరబోసుకున్నట్లు, చెట్ల కొమ్మలు వొంకర నీడల్ని ప్రసరిస్తున్నాయి. ఎక్కడో కీచురాళ్ళు కలిసి రోధిస్తున్నాయి దూరంగా నక్కల కూతలు ... తోడేలు అరుపు, కోతులు పారావేస్తూ నిద్రపోయి, చటుక్కున మేల్కొని, శత్రురాకని ప్రసారం చేస్తూ, వొక్కసారిగా మొరలెడుతున్నాయి. ఆకాశం ముక్కలై నేలమీద పడ్డ మాయతో మెరుస్తోంది. చుట్టూ గడ్డి నక్షత్రాలల్లె టెంట్లు.... ఏనాడో విచ్ఛిన్నమైపోయిన తారకల జంటలల్లె.

నిద్రపట్టలేదు కాబోలు తనకిమల్లె, రవికుమార్ కూడా ధైర్యం చేసుకుని బైటకొచ్చి నిప్పుముందు కూర్చున్నాడు. చూశాడు. రానా వద్దా అని తటపటాయిస్తున్నాడు. తనే వొచ్చాడు చంద్రశేఖరం.

"ఏం నిద్రపట్టలేదా?"

"ఊహూ" అని ఆవులించాడు రవి

"కవరు చూశావా?"

"ఊహూ"

"చించనే లేదా?"

"లేదంటివిగా"

"అదేమిటి?"

"నాలో నేను పందెం వేసుకున్నాను. కవరు చించి చూడకుండా ఎన్నిరోజు లుండగలను.... అని."

ఆశ్చర్య పడ్డాడు చంద్రశేఖరం.

"చూడనప్పుడు ఎందుకు ఆ కవరు?"

"కుతూహలం.... అణగదొక్కిన కుతూహలం"

"నిజంగానా?"

"ఓ" అని ఆవులిస్తూ టెంట్‌లో కెళ్ళాడు రవికుమార్.

నాలుగైదు రోజులు రోడ్డుపనిలో నిమగ్నులయ్యారు ఇద్దరు. అన్నీ మామూలుగా జరిగిపోతున్నాయి. ఉదయం రెండు ఫర్లాంగుల దూరంలోవున్న కొలనులో స్నానం, కాఫీలు, ఫారెస్టువాళ్ళు చెట్లు పడగొట్టడం.... మధ్యాహ్నం నేల చదును, బండిమీద కలప తోలించడం.... మధ్యాహ్నం కొలతలు. రాత్రి పెట్రొమాక్సులైటు వెలుగులో మాప్‌లు గియ్యడం నాలుగు రోజులయ్యాక కవరు విషయం కదలేశాడు చంద్రశేఖరం. కాస్త విసుగుతో ఇంకా విప్పలేదన్నాడు రవి. కుతూహలాన్ని అణగదొక్కి వుంచాడుట మరో ఆదివారం వచ్చింది. శేఖరం సైకిల్‌మీద వెళ్ళి తన ఉత్తరాలు తెచ్చుకున్నారు. రవికుమార్‌కి ఏమీ లేవన్నాడు."

"నాకామాత్రం తెలుసు, చెప్పనక్కర్లేదులే" అన్నాడు విసుగుతో.

మరోవారం గడిచింది. చంద్రశేఖరం కుతూహలాన్ని నిలదొక్కలేక పొయ్యాడు. కవరుమీద అడ్రసు చూడనీ మన్నాడు.

"నేను చూపించను. ఆ కవరు నాది. దాన్ని మరిచిపో" అని కసిరాడు రవికుమార్. తనకు ఉత్తరాలు రాకపోవడంలో పొందిన కసని కంఠంలో కనబరుస్తూ.

"మరి అడగనులే."

అని తనకి ఎవరెవరు మామూలుగా వ్రాస్తారో వారందరికి తలో కార్డు వ్రాశాడు. గతి పదిహేను రోజులలో తామెవరైనా తనకి ఉత్తరం

వ్రాసిన వయనం తెలియబరచమన్నాడు. పోస్టు రాకపోకలలో అంతరాయం రావడంవల్ల తాము వ్రాసినవి చేరలేదనీ.... వ్రాసివుంటే ఏం వ్రాపిందీ మళ్ళా వ్రాయమనీ బంధు మిత్రులకు వ్రాసిపడేశాడు.

పదిరోజులలో జవాబు లొచ్చాయి. మూడు వారాల క్రితం వ్రాసినవి తప్ప మళ్ళా ఎవళ్ళుం వ్రాయలేదంటూ వ్రాశారు. రేవతి వద్దనుండి కూడా వొచ్చింది. తానీ మధ్య ఏమీ వ్రాయలేదంది. వెనకటి కవరులో వ్రాసిన విషయాలేవో మళ్ళా చెప్పింది. ఆ మధ్య తనకి ఒంట్లో బాగాలేక వ్రాయ లేదంది. అమ్మయ్య అనుకుని నిట్టూర్చాడు చంద్రశేఖరం. తనకి ముఖ్య మైన ఉత్తరాలన్నీ తనకే చేరాయి. మరొకడి చేతులో పడకూడదని రేవతి లేఖకూడా తనకే మరి రవికుమార్ తీసుకున్న కవరు ఎవరు వ్రాసివుం టారు? ఆ సమస్య అల్లానే నిలిచిపోయింది. తనకి వ్రాసేవారి జాబితా తయారు చేసుకున్నాడు. అంతుదొరకలేదు. అది ఆఫీసు తాలూకు వాళ్ళు వ్రాసినదైనా ఐ వుండాలి—లేక చిన్ననాటి స్నేహితుడెవరన్నా ఐ వుం డాలి. లేకపోతే సంబంధం విషయం. తన అభిప్రాయం తెల్సుకోదల్చిన మధ్యవర్తి ఎవరన్నా వ్రాసివుండాలి--కొత్త సంబంధం తెచ్చిన మ్యాధవర్తి.

ఆనాడు ఆదివారం. ఎన్నడూలేంది, నేనూ వొస్తాను ఉత్తరాలకని బైలుదేరాడు రవికుమార్.

"కవరు చూశావా?''

''చెప్పను, నాదన్నాగా."

"నువ్వెందుకు బైలుదేరుతున్నావు?"

"ఉత్తరాలకోసం"

"రావుగా?''

"అమ్మ వ్రాస్తుందేమో."

మాట్లాడకుండా ఇద్దరూ బైలుదేరారు. మూడున్నరైంది. ముళ్ళ పొద దాటాక, ఎత్తు దిబ్బ. సైకిల్ పైకి తోసుకుంటూ వెళ్ళాలి. ఆయాసం చెమట్లు, కాసేపుఆగి విశ్రాంతి తీసుకున్నారు. మళ్ళా నడక సాగించారు. అరమైలు నడినాక సైకిలెక్కారు. అడవి చివరి కొచ్చే సరికి ఐదున్నర యింది. సూర్యుడు దిగులుగా పిచ్చిచెట్టు మ్రాను వెనక నక్కుతూ దిగుతు

తున్నాడు. చెట్లఆకులు ఎర్రబడ్డాయి. పడుచు అందరూ వొక్కమ్మడి కుంకుమ దిద్దుకున్నట్లు పళ్ళపైన ఎర్రచిగుళ్ళు మెరిసినట్లు ఎరుపు చెట్ల నడుమ నీడల్ని పీడిస్తోంది ఇంక పీడోక్కలుగా, పెద్దగాలి చుట్టుముట్టి క్షణంలో పట్టువొదలి, వెనక్కి కదిలి అడివి చీరమడతలు విప్పుతోంది. చీరఊడింది చీకటి పుట్టుకతో—దిబ్బలు స్తనాలుగా, పాలతో గట్టిపడి, కదలక నిలచి పొయ్యాయి.

"మీకో కవరుందండి" అన్నాడు సోమయ్య. చివాలున లాక్కున్నాడు రవికుమార్.

"అరె నీకూ వొచ్చిందే ఇది అపూర్వం సెలిబ్రేట్ చెయ్యాలి. ఎక్కడినుంచో అడిగొచ్చా"

కవరు జేబులో పెట్టుకున్నాడు.

"చూడను-ఉదయం చూస్తాను. అంతవరకూ కుతూహలం అణగదొక్కుతాను."

"నాకు చూపించనక్కర్లేదు— ఎవరివద్దనుండో తెలుసుకోవచ్చునా అంటున్నా" అన్నాడు చంద్రశేఖరం,

"నాకే తెలియదు."

"ఏం చోద్యం. పోనీలె; ఎల్లా సెలిబ్రేట్ చేస్తావు?"

"నువ్వెల్లా కావాలంటె అల్లాగ ఈ నెల టీ ఖర్చంతా నాది సరేనా?"

"అదికాదు. నాకవరు నాకిచ్చెయ్యకూడదు"

"అది వొద్దన్నాగా, అది తప్పు"

"ఇంక నీ కెందుకు? నీకూ వొస్తున్నాయిగా కవర్లు. కావాలంటే పది రూపాయలు తిరిగిచ్చి వేస్తాను. పైన మరో పది రూపాయలిచ్చుకుంటాను. ఆ కవరిచ్చెయ్యి"

"క్షమించమన్నాగా."

ఇద్దరూ టెంట్ దగ్గరికి చేరేసరికి ఎనిమిదైంది, రవి విప్పుముందు కూర్చున్నాడు. చంద్రశేఖరం టెంట్‌లోకెళ్ళి పడుకున్నాడు. ఆ రాత్రంతా అతనికి నిద్రపట్టలేదు. ఆ కవర్ను గురించి అంతపట్టింపు దేనికో! పోనీ ఎవరు వ్రాశారో చెప్పొచ్చుగా. అతను పనిలోకి వెళ్ళినప్పుడు గదంతా

గాలించి కవరు లాగి చూస్తే, తప్పేమిటి? తన కవరేగా. పందెంకోసంపేదో తమాషాకి డబ్బుతీసుకుని కవరు ఇచ్చివేశాడు.-జాలిదల్చి ఆ కవరులో మనిషున్నాడు. ఆ మనిషి మనసుంది దాన్ని ఎవరూ కొనలేరు. డబ్బు తీసుకున్నంత మాత్రాన ఆ కవరులో వ్యక్తితో అనురాగబంధాన్ని అమ్ముకున్నట్లే! గది గాలించి కవరు పట్టుకోవాలి-" అని నిశ్చయించుకున్నాక నిద్రపోయ్యాడు శేఖరం.

మర్నాడు ఉదయం పదకొండైంది పనివాళ్ళు కంకర పోస్తున్నారు కంకర రాపిడికి వేడి రేగింది ఎండతోసమంగా కాలుస్తోంది. నీడల చల్లదనాన్ని కూడా పల్చబరిచే వేడి, దుమ్మురేగుతోంది-పర్ణశాల ఆవరణలో మునుల తపస్సు భంగం చేసిన రాక్షసులు, ముని శాపానికి కూలిపోయి-కళేబరాలు దిగవిడిచినట్లు పెద్దపెద్ద కళేబరాలు చుట్టూ కూలి పడివున్నాయి నాటి జీవుడు సమాప్తం. ఎన్నెన్ని నాగరికతల చావు పుట్టుకుల కథనం ఎరగకనే-అజ్ఞానంతో కుమిలి యీనాటికి కూలాయి. భూమి కొంత చచ్చింది పక్షవాతం కమ్మి. వాటిని అంటిపెట్టుకున్న పక్షులు, కీటకాలు అనామకమైన వందలాది పురుగులు, గూళ్ళ సంతానం కామక్రీడని విర్చి మరో శక్తిని వెదుకుతూవెళ్ళిన జీవకోటి విశ్వంలో భగ్నమైన గోళాలు దిగవిడిచిన నల్లటి శూన్యానికి మల్లె-అణువు, పరమాణువులో ఐక్యమై సృష్టిలో వొక భాగం సమాప్తమై కథనం వుంది ఆ చెట్ల పతనంలో. ఆ కథనం వినని పనివాండ్రు ఎరగని ఇంజనీర్లు జాలిపడరు వారి అజ్ఞానంలో విషాదం వుంది.

ఆ విషాదం కుతూహలం అణగద్రొక్కుకున్న వ్యక్తి మనస్సులో వుంది. తలనొప్పి వుంది టెంట్‌కిపోయి పడుంటా నన్నాడు చంద్రశేఖరం.

"నేను వస్తానుపద" అన్నాడు రవికుమార్.

శేఖరం ఆశ్చర్య పడ్డాడు. తన మనస్సులోకి తొంగి చూసి తన కుతంత్రం కనుక్కొని, అది జరగకుండా తనూ వొస్తానంటున్నాడా అని?

"ఎందుకు?"

"ఊరెళ్ళాలి."

"ఏం?"

"అమ్మని చూడాలి."

"ఉత్తరం వొచ్చిందా?"

ఏమీ చెప్పడు రవికుమార్. తలపంకించాడు. ఔననా, కాదనా, ఏమో తెలియదు. ఐనా లన కెందుకు. అతనికి చెప్పడం ఇష్టం లేనప్పుడు తను ప్రశ్నలతో వేధించడం మంచిది కాదు.

"ఏం జబ్బు?"

"మానవుడికి పట్టే జబ్బే"

"అంటే?"

"వార్ధక్యం"

నవ్వాడు చంద్రశేఖరం. సరే, వెళ్ళిరా అన్నాడు. పనంతా నేను చూసుకుంటాలే అన్నాడు. సెలవుచీటి వ్రాసిమ్మన్నాడు. ఇద్దరూ టెంట్ కి చేరుకున్నారు. భోజనం చేసి- పెట్టె, సంచి, నలీమ్ నెత్తినపెట్టి, ఊరికి బైలుదేరాడు రవికుమార్.

అటు వెళ్ళగానే టెంట్ లోకి ప్రవేశించి, కవరు కోసం, రవి సామానంతా వెదకడం మొదలెట్టాడు. మూలలన్నీ చూశాడు. పాత కాగితాల కట్టలు, పత్రికలు, చెత్తకాగితాల తట్ట, దిండ్లక్రింద, పాతబట్టల మూట, వ్రేలాడేసిన చొక్కా- జేబులు- అన్నీ గాలించాడు శేఖరం. తన కవరు దొరకలేదు. తనతో తీసుకెళ్ళాడా కవరు? ఎందుకు తీసుకెళ్ళాడు? తనకి దొరక్కూడదనా? అంత పట్టుదల దేనికో? కోపం వచ్చింది చంద్ర శేఖరానికి. ఇప్పుడర్థమైంది. పట్టింపుల ప్రభావం ఎంతటిదో, ఈ పట్టింపుల కోసమే, రాజ్యాల నడుమ తగాదాలు, కొట్లాటలు, యుద్ధాలు, పార్టీల వ్యాజ్యాలు, కోర్టుకీడవడాలు, దివాలా తియ్యడాలు, ఒకర్ని వొకరు హత్య చేసుకోడాలు, ఉరి తీసుకోడాలు అర్థంలేదు. నిరర్థకమైన పట్టింపుకి అంతటి ప్రభావమా! లోకంతోబాటె తనూను. మానవాకృతికి విరుద్ధంగా వుండకూడదు తోటి మానవుడు. మానవుడి పట్టింపు తవ్విన సమాధిలో తనూ

పడాలి. ఆ కవరు ఇవ్వకపోతే రవిని పొడిచి చంపెయ్యాలి. ఈ అడివిలో చంపితే దిక్కూ మొక్కూ లేదు. అలా చీకట్లో వెళ్ళాడు....ఏ పులో చంపి లాక్కుపోయిందంటె—ఏ గొడవా లేదు శవం లేదు. హత్యానేరం లేదు. పైగా, హత్యచెయ్యడానికి ప్రబలమైన కారణాన్ని ఎవ్వరూ ఊహించ లేరు, ఋజువు చెయ్యలేరు. ఓవేళ దొరికినా పదిహేనేళ్ళ శిక్ష—పదిహేను పైసల కవరు. పై సాకో ఏడు. అంతే జీవితం. అదే పట్టింపు తుది కథ నం. రవిని చంపాలి.

వెళ్ళిన ఆరు రోజులకి తిరిగొచ్చాడు రవికుమార్. చిద్విలాసంగా వున్నాడు.

"ఎల్లా వుంది అమ్మగారికి?"

"ఫస్టు"

సామాను లోపల పెట్టించి, స్నానం చేసి వొస్తానని వెళ్ళాడు రవి కుమార్.

ఆ మర్నాడు కాని ఇద్దరూ మాట్లాడుకోడం జరగలేదు.

"ఏమిటి విశేషాలు?" అన్నాడు చంద్రశేఖరం.

"పుస్తకాలు తెచ్చుకున్నాను. అంతా బాగానే జరిగింది"

"ఏమిటి జబ్బు?"

"చెప్పాగా—వార్ధక్యం."

"ఇంకేమిటి?"

"ఏమీలేదు" అని పెదవి చప్పరించాడు. చంద్రశేఖరంకి అతనలా ముభావంగా వుండటం నచ్చలేదు. కవరు విషయం అడిగేసి, ఇవ్వనంటే పొడిచెయ్యాలి. ఆపని రాత్రిళ్ళ చెయ్యడం మంచిది. బండివాళ్ళు; సలీమ్-అంతా పడుకున్నాక చీకట్లో సఫా ఐపూ మచ్చా వుండదు. సాయంత్రం ఐదైంది. వొచ్చిన మనియార్డర్ నాక్కాదని తెలుసుకున్న తర్వాత విస్పృహతో వెనక్కి మళ్ళిన వ్యక్తిలా సూర్యుడు చెట్లవెనక మెల్లగా జారుకుంటున్నాడు. పడమటి ఆకాశంలో పిల్లమేఘాలు కమ్మడం వల్ల కాబోలు, సూర్యుడు తీక్షణంగా లేదు. రజస్వల కావి బాలికలల్లె, పిల్లమేఘాలు, దాగిన ఆవేశాన్ని తొంగి చూసే తనవని కొస్త కొస్త ప్రదర్శిస్తూ సూర్యుడి

మీద పడుతున్నాయి. అమ్మో, వాటి తపనకి తట్టుకోగలడా పాపం, ఆ సూర్యుడు. నడివయస్సు దాటివార్ధక్యంలో అడుగుపెడుతున్నాడు సూర్యుడు. ముసుగు బిగించి పశ్చిమ ఆకాశపుటంచుల్లో పవ్వళిస్తాడు. ఇంకెంత? మరోగంట. మరో గంటలో భోజనం. సలీమ్ నిద్ర, బండివాడి గుర్రు. ఎడ్ల మెడలో గంటలు కదలవు అడవి దేవత అగ్నిముందు, తన నగ్న శరీరం చూపలేక, లోపలికి అంతర్ధానమౌతుంది. అది సమయం, మృత్యువుకీ-హత్యకీ.

కాని దానివల్ల ఏం ప్రయోజనం. కపరు దొరికి తీరుతుందని అనుకోడానికి వీల్లేదు. కవరు చింపేశాడేమో రవి? వృధాగా హత్యచెయ్యడమే అవుతుంది. అతను బ్రతికి వుంటేనే కవరు కథ చివరంటా వినడానికి వీలవుతుంది. చంపొద్దు కాని, మాటామాటా వొచ్చి, పెద్ద పట్టి పులకు పోయి గర్వంవొలక బోసి దాబు చేస్తే-అప్పుడు ఎలానూ హత్యే తప్పదు. కత్తి పదునుగా వుంది తోలు సంచిలో పెట్టి, పాంట్ వెనక జేబులో భద్రంగా దాచాడు. అసలు యీ పాంట్లకు వెనక జేబు, ఇట్లాంటి ఆయుధాలు భద్రం చేసుకోడం కోసమే కనుక్కున్నారు. ఏడు దాటింది. అడవి దేవతలు కొమ్మల మధ్య నృత్యం సాగించారు. పాడిపాడి గొంతులు జీరపొయ్యాయి కీచురాళ్ళు కూడా చోద్యం తిలకిస్తూ సలీమ్‌భాషలో "ఖామోష్" అయ్యాయి. అగ్ని జ్వాలలు లేచిపడుతూ, కన్నబిడ్డలైన కట్టె ముక్కల్ని కాల్చివేస్తున్నాయి. దాని ఆకలికి అంతం లేదు దొంకిన కొద్దీ తనివితీరక, ఇంకా ఇంకా తినేస్తాయి-మానవుడికి సాధ్యంకాని కామోద్రేకంతో మానవుడు బూడిద వర్ణమేట ప్రకృతిదికూడా. ఎవరో చిత్రకారుడన్నాడుట. ప్రకృతిలో ప్రధానమైన వర్ణం ఏదీ అంటె, బూడిదరంగు అన్నాట్ట. శివుడు బూడిద రాసుగుంటాడు-ఆ శివుడితో పార్వతి నృత్యం-శ్మశానంలో బూడిద మధ్య పుర్రెంతో ఉత్తేజితురాలైన పార్వతి బూడిద ప్రేయసి భోజనాలయ్యాయి. ఏం తింటున్నాడో తనకే తెలియదు. చేతులు కడుక్కున్నారు. అరగంట గడిచింది. కట్టెలు వేస్తున్నాడు చల్లారే అగ్నిలో. సలీమ్ పక్క చుట్ట సర్దుకుంటున్నాడు.

"అల్లా తిరుగుదాం; రా" అన్నాడు చంద్రశేఖరం.

"పద."

ఇద్దరూ నడుస్తున్నారు తొమ్మిది దాటింది. అగ్ని వెలుగు సన్న గిలి, వెన్నెల వెలుగు ఆకులమధ్య, ఇంక పేకాట ఆడనని ప్రేయసికి వాగ్దానం చేసి, పేకముక్కల్ని చించిపారేసినట్లు, అక్కడక్కడ మెదల కుండా పడింది. మార్చి మధ్యలో పుట్టి మునిగిపోయినట్లు వేసంగిగాలి, చలి గాలిగా మారువేషం ధరించి కవ్విస్తోంది సన్నగాలి. గడ్డిలో కూలబడ్డాడు రవికుమార్.

"ఇంక కాస్త దూరం వెడదాం పద."

"నేవింక రానుబాబు. చీకటి" అన్నాడు రవి. చంద్రశేఖరంకూడా పక్కనే కూర్చున్నాడు, పాంట్ వెనక జేబు సర్దుకుని. భద్రంగా వుంది సంచిలో కత్తి. ఎక్కడ పొడ్చినా ఎవ్వడూ కనుక్కోలేడు.

"ఇదుగో రవీ ఈ పూట ఏదోవొకటి తేల్చెయ్యదల్చుకున్నా. ఆ కవరు నా కివ్వు" అన్నాడు. తాను ముందుగా అనుకున్న వాక్యాలవి స్మరించుకుని.

"ఇవ్వను."

ఇవ్వవా?"

"ఏనాడో చెప్పాను."

"ఖాయమేనా?"

"ఓ"

"ఏం ధీమా!"

"అంతగా అంటున్నావు గనుక,—ఎక్కడనుంచో చెప్తాను"

"అది చాలదు, ఇచ్చితీరాలి."

"ఇవ్వను."

"ప్రాణాలపైన ఆశ వొదులుకుంటావా?" అని, జేబు సవరిస్తు న్నాడు.

'అమ్మో—పాపంబె, చచ్చే భయం నాకు. ఎక్కడనుంచో చెప్తా వంటివిగా."

"పోసీ చెప్పు."

"అల్లా అన్నావు బాగుంది. చెప్పేస్తున్నాను. వన్ టూ త్రి రెడి."

"చెప్పు" అని భుజం పుచ్చుకుని కదిపాడు చంద్రశేఖరం.

"రేవతి వ్రాసింది"

"ఆ!"

చకితుడై, ఒగిపోతున్న చందమామల్లె, దిగాలుపడి కూర్చున్నాడు చంద్రశేఖరం.

"అంతేకాదు. మరో వార్తకికూడా సిద్ధపడు. ఆమెను పెండ్లిచేసుకోబోతున్నాను. నీ రేవతిని" అని. చిత్రంగా నవ్వడం సాగించాడు రవికుమార్. ఎంతవింత ఊహాలు శేఖరం మనస్సులో, మెరుపులల్లె మెరిసి అంతర్థానమౌతున్నాయి. దగా చేసింది రేవతి. వీడు అక్కడికే వెళ్ళాడు. ఏదో జరిగింది. రేవతి కులట. శీలంలేనిది, వీణ్ణిచంపి ఏం ప్రయోజనం? రేవతిని చంపాలి. అందమైన రేవతిని. లేకపోతే "ఒథెల్లో" అన్నట్లు ఆమె ఇంకా ఎందర్ని మోసగిస్తుందో. తనకి షేక్స్పియర్ నాటకంలో, విషాద నాయకుడి సమస్య వచ్చిపడిందేమిటి?

"ఏం జరిగింది—చెప్పు."

చంద్రశేఖరం తొడమీద చేతులు ఆనించి అతని నడుం తడుముతూ, నిమురుతున్నాడు రవికుమార్. ప్యాంట్ వెనక జేబులో ఎత్తుగా తగిలినదాన్ని, బైటకు లాగాడు సంచిలోంచి కత్తిని తియ్యబోతుండగా, అతని చేతిలోంచి కత్తిని లాక్కున్నాడు శేఖరం.

"పొడుచుకు చచ్చిపోదామనే! ఆగు." అని కత్తిని లాక్కోబోయ్యాడు రవికుమార్.

"మరి పెండ్లిచేసుకోవూ. రేవతిపట్ల అంతేనా నీ నమ్మకం అంత నమ్మతగనిదాన్ని చేసుగుని నువ్వేం సుఖపడతావులే అనుకుని, నేను చేసుగోడానికి నిశ్చయించుగున్నాను. నీకేమో కట్నం ఇవ్వలేదు నాకు మాత్రం, మూడువేలు కట్నం ఇస్తోంది అని నవ్వుతున్నాడు రవికుమార్. కత్తి విసిరిపారేశాడు చంద్రశేఖరం.

"విషయం చెపుదూ చంపక."

"చెప్తావట్టు. నీ ప్రేయసి రేవతికి ఆ మధ్య జబ్బుచేసిందిట."

"అవును-రాసింది."

"మధ్యలో అడ్డకు. ఆమె స్నేహితురాలు సుమతి పక్కింట్లో ఉంటుండిట. నా వయస్సుంటుంది. పెండ్లి జరిగిన ఏడాదిలోగా భర్త చని పొయ్యాడుట. ఆమెకు ఆస్తుంది. ఇరవై యెకరాలభూమి-ఇప్పుడు ఎకరం తొమ్మిదివేలు చేస్తుందిట; కాలేజీలో కొంతవరకూ చదివి, ఫేలై మానేసిం దిట, రేవతి జబ్బు నయమౌతున్న రోజుల్లో, నీకో ఉత్తరం వ్రాసి పెట్ట మందిట సుమతిని. ఆమె వ్రాసింది. రేవతి సంతకం పెట్టి పోస్టుచేసింది. తనకీ నీకూ వున్న స బంధం, పెండ్లికి అంతరాయం-అన్నీ సుమతితో చెప్పిందిట. మరోవారం గడిచాక రేవతితో చెప్పకుండా, రేవతి వ్రాసినట్లే నీకో ఉత్తరం వ్రాసి పోస్టుచేసింది-అదొక అల్లరిచేష్ట. ఏం జరుగుతుందో చూద్దామనిట. రేవతి దస్తూరిలాగా వ్రాసింది. సమాధానం ఫలానా అడ్ర సుకే వ్రాయమని, మరో కొత్త అడ్రెసిచ్చి, రేవతి సంతకంతో వ్రాసింది కవరు. ఆ కవరే, నీదగ్గరనుండి నే తీసుకున్నది.

"అందుకా-ఆ ఉత్తరం తర్వాత, మళ్ళా ఏదీ వ్రాయలేదని వ్రాసింది రేవతి. సుమతి ఉత్తరం సంగతి ఆమెకి తెలియదుగా మరి."

"అదే వద్దన్నది ఆ కవరు, నాలుగైదు రోజుల తర్వాత చించి చదివాను. నువ్వు వ్రాసినట్లే వ్రాశాను. అందులో, కొన్ని కారణాలవల్ల రవికుమార్ అను పేరిట జవాబు వ్రాయవల్సిందిగా కోరాడు చూడాలి నుంది, వెంటనే బయలుదేరి రావల్సిందనీ, మరో ఎడ్రసిచ్చి అక్కడ కలుసుకోవల్సిందనీ కొన్ని కారణాలవల్ల, ఆమెని సుమతిగా వ్యవహరిం చాల్సిందనీ వ్రాసింది.

నా కొచ్చిన ఉత్తరం సుమతి వ్రాసిందే. కుతూహలం విలదొక్కు కోలేక బైలుదేరి వెళ్ళాను. నేను చంద్రశేఖరం కానని వెంటనే గ్రహిం చింది. విన్నొకక్కమాదు చూసిందిట. విషయం అంతా చెప్పింది. పొర పాటు క్షమించమంది, పెండ్లి చేసుకుంటారా? అభ్యంతరమా! ఇష్టపడింది. మనిషి బాగుంటుంది. బోలెడు ఆస్తి ఎటొచ్చి. వయస్సు నా అంతా వుంటుంది. మరో ఏడు పెద్దేమో కూడా. ఒప్పేసుగున్నా. మావాళ్ళకి వ్రాశాను డబ్బుకి అభ్యంతరం పెట్టేవారెవ్వరూ వుండరుగా. మరో మంచి

వార్త. కట్నం ఇవ్వడంలేదనేగా, నువ్వు రేవతిని చేసుగోడానికి మీ వాళ్ళ అభ్యంతరం? ఆ మూడువేలు తనిస్తానంది రేవతికి. ఇంక పెండ్లికి అభ్యంతరం ఏమిటి?

చంద్రశేఖరం లేచి అటూ ఇటూ పచార్లు సాగించాడు వెదికి కత్తిని తీసుగున్నాడు. సంచీలోంచి పైకిలాగాడు కత్తిని.

"ఈ కత్తితో నా పీక తెగ్గోసుకుంటున్నాను" అన్నాడు చంద్రశేఖరం.

"రేవతి మాటేమిటి?"

"అందుక్కాదు నిన్ను చంపెయ్యాలన్న ఊహతో ఈ కత్తిని జేబులో వుంచుకు తిరుగుతున్నాను. అందుకు?"

"నీ ఉత్తరం నీకివ్వనందుకు నన్ను చంపినా పాపం లేదుగా,"

"ఉత్తరం ఇవ్వకపోయినా, ప్రేయసి విచ్చావుగా. ఆమె ఖరీదు పదిహేనుకోట్లు. కవరు ఖరీదు పదిహేను పైసలు;-పైసకి వొక కోటి"

ఇంక క్షణం ఆగను కళ్యాణం తోసుకొచ్చింది, పందిట్లోకి పోతాను అన్నట్లుగా, పది అవగానే చందమామ ఆకాశపు టంచులో కరిగి పొయ్యాడు.

కధ కంచికి, మామ్ తనింటికి, మనం మనింటికి.

మధ్యలో మామ్ ఇంటి గొడవేమిటంటారేమో! ఈ కధలో ఆయన ప్రసక్తి. వస్తుంది. సామర్‌సెట్ మామ్,—విఖ్యాత ఆంగ్లకథకుడు, 1965 డిసెంబర్‌లో చనిపోయాడు-ఆయునింటికి వెళ్ళాడు. ఆయన "రచయిత నోటుబుక్కు" అనే గ్రంధంలో, తను భారతదేశం ముప్ఫైఏండ్ల క్రితం పర్యటించినప్పుడు చూసినవీ, విన్నవీ వ్రాసుగున్నాడు. ఆయన అస్సామ్ ప్రాంతానికి వెళ్ళినప్పుడు, అక్కడ ఇద్దరి వ్యక్తులని గురించిన వింత కధ వొకటి విన్నాడుట. "ఎ, "బి, అనే వారలు, దూరప్రాంతంలో మారుమూల ప్రదేశంలో పని చేసేవారుట. "ఎకి ఉత్తరాలు వస్తుండేవిట. "బి,కి వొక్కటి వొచ్చేదికాదుట ఒకమారు, ఎకి వొచ్చిన ఉత్తరం తన

కిచ్చివేస్తే ఐదు రూపాయలిస్తానన్నాడుట. ఏ వొప్పుకొని. తన కొచ్చిన ఉత్తరాల కట్టలో వొకదాన్ని తీసుకొమన్నాడుట. బి తీసుకున్నాడుట. కాని "ఎ"కి ఆ ఉత్తరం పట్ల కుతూహలం నిలుపుకోలేక, డబ్బిచ్చివేస్తాను తన ఉత్తరం తనకి తిరిగి ఇచ్చెయ్యవలసిందిగా కోరాడుట. బి ఇవ్వనన్నాడుట. డబ్బిచ్చి కొన్నాను, ఆ ఉత్తరం నాది అన్నాడుట. అంతే జరిగింది. ఇది వింతగా కనబడే వృత్తాంతమైనా, తుది, మొదలు, ముగింపు లేక, మధ్య అలా గాలిలో నిలిచిపొయ్యే విషయం అవడంవల్ల, దీన్ని గురించి కథ వ్రాయలేకపొయ్యాను అని వ్రాసుకున్నాడు మామ్ తన నోట్ బుక్కులో.

ఇప్పుడు ఆ వృత్తాంతాన్నే కథగా మార్చాను నేను. కాని, ఆ కథ వ్రాస్తే, మామ్ ఇల్లా వ్రాసి వుంటాడు అని బలాబలాల ప్రదర్శనకేకో కోసం వ్రాసింది కాదు. దూరం ప్రాంతంలో గడిపేవార్ని గురించి వ్రాయడం మామ్‌కి ఇష్టం. అదొక్కటే తప్ప మామ్ కథకి కావల్సిన ఇతర హంగులూ, వస్తువూ ఇందులో లేవు గనుక. ఆయన ఈ కథ వ్రాయలేదు. వ్రాస్తే ఎట్లావ్రాసి వుండేవాడో చెప్పలేం.

ప్రతి కథకుడూ కొన్ని హంగులు, వొకరకం ఇతివృత్తం, తన ప్రకృతిని అనుసరించి ఎన్నుకుంటాడు. నాక్కావల్సినవి వొకటి రెండు దొరికాయి. గనుకనే దీన్ని కథగా కూర్చాను, మామ్ ఇల్లా వ్రాసి వుంటాడనుకోటం లేదు నేను. అందుకనే మామ్ వ్రాయని కథ అన్నాను.

ప్రచురణ 1966 విశ్వవాణి మార్చి సంచిక